# జవాబుదారి



**గుడిమెట్ల గోపాలకృష్ణ**

**ప్లాట్‌ఫాం ఒకటి నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్ 16.50 కి వదలాలి. ఇంకా 5 ని॥ల వ్యవధి వుంది. శేఖర్ అనంతమైన ఊహల్లో తేలియాడుతున్నాడు.** ఈ బ్యాంక్ పి.ఓ. పరీక్ష పాసైతే జీవితంలో సెటిలవ్వవచ్చు. 5 వేలు పెట్టి అందుకే కోచింగు తీసుకున్నాడు. దేవుడు ట్రెయిను రైట్టయిముకి సికింద్రాబాదు చేర్చు. స్పెషల్ ఎనౌన్స్‌మెంటు ప్లీజ్! పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లో 'యస్-8' లో ప్రయాణిస్తున్న శేఖర్ గారు ఎంక్వయిరీ దగ్గరకొచ్చి మాట్లాడాలి. గోదావరిలో యస్-8 మళ్ళీ మళ్ళీ తృళ్ళిపడ్డాడు శేఖర్. ఇంకా ట్రెయిను కదలడానికి 2 ని॥ల టైముంది. "వేరె ఎవరైనా శేఖరా? తనకేనా?"

ట్రెయిన్ రష్‌గా వుంది. "ఆ కొసనుంచి ఎంక్వయిరీకి చేరేసరికల్లా ట్రెయిను వదిలేస్తుంది. తర్వాత వుదయం చేరే ట్రెయిన్ లేదు."

ఆలోచిస్తుండగానే గోదావరి కదిలిపోయింది. ఎవరి ఆలోచనలూ తనవి కాదన్నట్టు టాప్ బెర్త్‌లో 'క్వశ్చన్ బేంకు' తిరగేస్తూ, విజయవాడలో ఎక్కువ సమయం ఆగుతుంది అప్పుడు మాట్లాడొచ్చులే అనుకున్నాడు.

ట్రెయిను స్పీడు అందుకుంది. ఆ కుదుపులకు నిద్రలోకి జారుకొని మెలుకువ వచ్చేసరికల్లా ఖాజీపేట దాటిపోయింది.

అనుకున్నట్లుగానే సికింద్రాబాద్ 6 గం॥ రయిట్టయిములో చేరింది.

గాభరాగా ఫోను కొట్టాడు. దిగ్భ్రాంతి చెందాడు.

నాన్న పోయేర్ట! హార్ట్ ఎటాక్!!

మనసు కకావికలమైంది. నాన్నతో గడిపిన క్షణాలు సినిమా రీళ్ళలా కళ్ళ ముందు తెరిగాయి. 'ఇంకేం పరీక్ష రాయగలను' అనుకుంటూనే సెంటరులోకి వెళ్ళాడు. అక్కడ బోర్డు, 'రెండు వర్గాల కొట్లాటల కారణంగా పరీక్ష నిరవధికంగా వాయిదా'

❄ ❄ ❄

ఆఖరి క్షణంలో నాన్నా నీతో మాట్లాడాలని చాలా తహతహపడ్డాడరు. అంత్యక్రియలు జరిపించేశాం.

'ఏంటి చెప్మా ఎందుకిలా జరిగింది'

జీవితాంతం వెంటాడే ప్రశ్న. 'ఇప్పుడే జరగాలా సంఘర్షణలు! ఈ వైపరిత్యాలకు ఎవరు కారణం?

'సాయంత్రం 4.30 కి ఎంక్వయిరీకి ఫోను చేస్తే నువ్వెందుకు డ్రాపయిపోలేదు' అమ్మ ప్రశ్న.

'ప్రకటన నేను విన్లేదు' నేనాడుతున్న అబద్ధానికి అమ్మ నా కళ్ళలోకి సూటిగా చూసింది.

వరుసగా అడిగిన సంఘటనలకు 'ఎవరు జవాబుదారీ'

మూడ్రోజులక్రితం ఉద్యోగం సంపాదించే విషయంలో నాన్నతో పడ్డ ఘర్షణవల్లే నేను అంత్యక్రియలకు హాజరవలేదని అమ్మ మనసులో మాట బయటపెట్టింది. సప్తసముద్రాలూ మునిగిపోయినంతగా ఏడ్చాను. ఎవరు ఎవర్ని ఓదారుస్తారు? ఎవరు దీనికి జవాబుదారీ?? ✸